


స్వయం ఉపాధికి ఎన్నో అవకాశాలు

ప్రజాశక్తి-విజయనగరం

స్వయం ఉపాధికి ఎన్నో అవకాశాలని, మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కృషి చేయాలని డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, విశాఖపట్నం ఎంఎస్‌ఎంఇ అభివృద్ధి సంస్థ, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. పారిశ్రామిక రంగంలో ఉన్న అవకాశాలు, కొత్తగా పరిశ్రమలను స్థాపించడం, రుణాలు పొందే విధానం, మార్కెటింగ్ తదితర అంశాలను ఈ వర్క్‌షాప్‌లో వివరించారు. కొత్త పరిశ్రమల స్థాపనకు మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించి, రిజిస్ట్రేషన్లు చేశారు. ఎంఎస్‌ఎంఇ విశాఖపట్నం డెవలప్‌మెంట్ సెంటర్ ఎడి జె.చంద్రమౌళి మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం ఎన్నో విధాలుగా సహకారం అందిస్తోందని చెప్పారు. మెప్మా పీడీ సుధాకరరావు మాట్లాడుతూ పొదుపు సంఘాలకు పరిశ్రమల స్థాపనకు గరిష్ట రుణపరిమితిని ప్రభుత్వం ఇటీవలే రూ.20 లక్షలకు పెంచిందన్నారు.

ఎక్కడమ్మా.. నీవు లేనిది..!



'ఎక్కడమ్మా.. నీవు లేనిది?, ఏమిటీ నీవు చేయలేనిది?' అని కీర్తించాడో కవి. పోరులో అధినేత్రిగా... ఊరులో అధికారిగా అంటూ మహిళల బహుముఖ పాత్రను వివరించాడు మరో రచయిత. ఇలా సృష్టికే మూలంగా ఉన్న మహిళ ఓవైపు అన్ని రంగాల్లో రాణిస్తుండగా, మరోవైపు అడుగడుగునా అణచివేతకు గురవుతోంది.. నవమాసాలూ మోసి, పిల్లల్ని కని, తల్లిగా లాలిస్తూ పెద్ద చేస్తుంది.. సోదరిగా ప్రేమానురాగాలను పంచుతుంది.. భార్యగా జీవితంలో సగభాగమై ముందుకు సాగుతోంది.. ఉద్యోగిగా సమాజానికి తన వంతు సేవలందిస్తోంది.. ఈ క్రమంలో ఎన్నో ఆటుపోట్లు, ఒడిదొడుకులు ఎదురైనా పుట్టెడు సహనంతో ముందుకు సాగుతోంది.. ఈ నేపథ్యంలో మహిళల వీరోచిత పోరాటాలు గుర్తుచేసుకుని, ఉన్నతమైన సమాజం వైపు ఆలోచింపజేసుకుంటూ ఏటా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు.

- కండక్టర్ నుంచి కలెక్టర్ వరకు
- యాక్టర్ నుంచి డాక్టర్ వరకు
- పోరులో అధినేత్రిగా...
- ఊరిలో అధికారిగా
- ఇంటిని నడిపితే ఇల్లాలిగా
- అన్నింటా రాణిస్తున్న మహిళలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

డాక్టర్ నుంచి యాక్టర్ వరకు, కండక్టర్ నుంచి కలెక్టర్ వరకు, హోంగార్డు నుంచి మేజర్ వరకు మహిళలు రాణిస్తున్నారు. క్రీడా, కళా, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక, ఆర్థిక తదితర రంగాల్లో ఎంతో మంది మహిళలు తమ సత్తా చాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పేరు తెచ్చుకుంటున్నారు. వ్యవసాయ రంగంలోనూ వారిదే కీలకపాత్ర. జిల్లా కలెక్టర్, ఎస్‌పి సహా ఎన్నో శాఖల్లో ఉద్యోగులు కూడా మహిళలే ఎక్కువగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఐసిడిఎస్ పీడీ, డ్వామా పీడీ, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, డిపిఎం, డిపిఒ, విజయనగరం, బొబ్బిలి ఆర్‌డిఒలు ఇలా ఒకరా.. ఇద్దరా ఎంతో మంది జిల్లా అధికారులు కూడా మహిళలే. చివరికి బండరాళ్లు మోసేవారిలోనూ మహిళలు భాగస్వామ్యం అవుతున్నారు. ఇలా జీవన పోరాటంలోనూ, సమాజాభివృద్ధిలోనూ భాగస్వామ్యమౌతూనే తిరిగి ఇంటికి వెళ్లాక భార్యగా, అమ్మగా ఇల్లు చక్కబెడుతున్నారు.

పురుషులతో సమానంగా పోటీ పడుతూ, కష్టపడుతున్నప్పటికీ పలు సందర్భాల్లో మహిళలు అన్నింటా అణచివేతకు, వివక్షతకు గురవుతున్నారు. రాజకీయ వేధింపులూ తప్పడం లేదు. పని ప్రదేశాల్లో అగౌరవం, వేధింపులు ఇంకా కొనసాగుతున్నాయి. ఆఖరికి అమ్మాయి పుట్టుకే అశుభమనుకునే స్థాయికి నేటి సమాజం దిగజారిపోయింది. ఆడబిడ్డగా నిర్ధారణ అయితే గర్భంలోనే కత్తులతో కడతేరుస్తున్నారు. ఇంటి గుమ్మం దాటితే తలదించుకోవాలన్న దగ్గర నుంచి మగాళ్లతో మాట్లాడకూడదన్న వరకు అన్నీ ఆంక్షలే. పని ప్రదేశాల్లో మహిళలు ఆర్థిక, లైంగిక దోపిడీకి గురవుతున్నారు. మరుగుదొడ్లు సైతం లేక ఆత్మగౌరవాన్ని చంపుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఇంకా చెప్పాలంటే ప్రత్యేకించి మన జిల్లాలో మహిళా ప్రజాప్రతినిధులు ఉన్నా, వారి కుటుంబసభ్యులే పెత్తనం చెలాయిస్తున్నారు.

వేధింపులు, అణచివేత నేపథ్యంలో ఆడపిల్లలంటే ఎంతోమంది భారంగా భావిస్తున్నారు. బహుశా అందుకేనేమో కొన్నేళ్లుగా జిల్లా జనాభాలో మహిళల సంఖ్య తగ్గుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ అంతరాలు పోవాలంటే రాజ్యాంగం కల్పించిన హక్కులను పాలకులు నిష్పక్షపాతంగా అమలు చేయాలి. ఈ పరిస్థితుల్లో ఆకాశంలో సగంగా ఉన్న మహిళ సగర్వంగా తలెత్తుకు తిరగాలని, భవిష్యత్తు మరింత దేదీప్యమానం కావాలని, అందుకు రాజ్యాంగ యంత్రాంగం సహకరించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

పోరాట చిహ్నమే మహిళా దినోత్సవం

కుట్టుపని చేసే శ్రామిక మహిళలు నిర్వహించిన వీరోచిత పోరాట సంప్రదాయాన్ని నిలబెట్టేందుకు ఏటా మార్చి ఎనిమిదో తేదిని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. తొలుత శ్రామిక మహిళలు ఈ కార్యక్రమానికి నాంది పలికితే, ఆ తర్వాత మహిళా కమ్యూనిస్టులు నాయకత్వం వహించి మరింత ముందుకెళ్లారు. అణచివేత, వివక్షతను వ్యతిరేకిస్తూనే స్వేచ్ఛ, సమానత్వం కోసం నేటికీ మహిళలు పోరాడుతూనే ఉన్నారు. జాతి, మత, కుల, ఆర్థిక, సామాజిక వ్యత్యాసాల్ని పక్కనబెట్టి ఒకే వేదికపైకి చేరాల్సిన రోజు ఇది.

గెలిపిస్తే ఉత్తరాంధ్ర గొంతుకవుతా

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే శాసన మండలిలో ఉత్తరాంధ్ర గొంతుకనవుతానని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విభజన హామీల్లో భాగంగా విశాఖకు రైల్వేజోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, గిరిజన, పెట్రోలియం యూనివర్సిటీ హామీలు అమలు కాలేదని, వీటిపై శాసనమండలిలో గొంతు వినిపిస్తానని ఆమె చెప్పారు. ఆమదాల వలస షుగర్ పరిశ్రమతో సహా మూతపడిన పరిశ్రమలను తెరిపించేందుకు వైసిపి ప్రభుత్వం కనీస ప్రయత్నించకపోగా, ఒక మంత్రి చిట్టివలస జూట్ యాజమాన్యానికి సహకరించారని చెప్పారు. ఉత్తరాంధ్రలో అతి పెద్దదైన నెల్లిమర్ల జూట్ మిల్లు కూడా మూతపడిందన్నారు. పారిశ్రామిక, రసాయనిక వ్యర్థాలను సముద్రంలోకి విడిచి పెట్టడంతో మత్స్యసంపద దెబ్బతింటోందని చెప్పారు. ఉపాధి లేక మత్స్యకారులు వలసబాట పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదకరమైన కొవ్వాడ అణు విద్యుత్కేంద్రాన్ని ఉత్తరాంధ్ర ప్రాంతంపై రుద్దుతున్నారని విమర్శించారు. ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులకు స్వప్రయోజనాలే తప్ప, ఉత్తరాంధ్ర అభివృద్ధి కనీసం పట్టడం లేదన్నారు. జిల్లాకు చెందిన చెందిన ఓ సీనియర్ మంత్రి ఇంకో మెట్టు ముందుకెళ్లి స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని సమర్థించారని చెప్పారు. పట్టభద్రుల ఎన్నికల్లో ప్రభుత్వం అనేక అక్రమాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు.



రణస్థలంలో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

రమాప్రభ విస్తృత ప్రచారం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పొందూరు, జి.సిగడాం, రణస్థలం, పలాస మండలాల్లోని పలుచోట్ల మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. పొందూరు సన్న ఖాదీని ప్రోత్సహించి, సబ్సిడీ, మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. పైడిభీమవరంలో వంద పడకల ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణానికి, ఫార్మా, ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి పాటుపడతానని తెలిపారు. సిపిఎస్ రద్దు కోసం పనిచేస్తానని చెప్పారు.

వైసిపి అధికార దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయండి

ఎన్నికల కమిషన్‌ను కోరిన ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో వైసిపి అధికార దుర్వినియోగానికి ఎన్నికల కమిషన్ అడ్డుకట్ట వేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ విజ్ఞప్తి చేశారు. మంగళవారం విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన మండలి ఎన్నికలో వైసిపి బరితెగించి వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని, వాలంటీర్ల వ్యవస్థను తమ అభ్యర్థి గెలుపు కోసం వాడుకుంటోందన్నారు. పలు సందర్భాలలో వీటిపై జిల్లా కలెక్టర్‌కు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా, ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో మరింత రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, సర్వశిక్ష అధికారులు, ఆనందపురం ఎంఇఒపై తాము సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేసినా వారిపై నేటికీ చర్య తీసుకోలేదన్నారు. ఎయు విసి వ్యవహారంలో తమకు దొరికిన సాక్ష్యాలు కూడా విచారణ అధికారికి దొరక్కపోవడం విడ్డూరంగా ఉందన్నారు. హోటల్‌లోని సిసి కెమెరాల ఫుటేజీలను వెంటనే తీసుకోవాలని తాము సూచించినా ఆ పని చేయలేదన్నారు. కావాలనే సాక్ష్యాలను తారుమారు చేయడం తప్పు చేసిన వారిని కాపాడడానికేనన్నారు. విచారణల పేరిట కాలయాపన జరపడం, విచారణను కూడా కింది స్థాయి అధికారులతో నామమాత్రంగా చేయించడంతో అధికార పార్టీ తన పని తాను చేసుకుపోతోందన్నారు. ప్రభుత్వం జీతాలు చెల్లించే వాలంటీర్ల వ్యవస్థను తన పార్టీ జేబు సంస్థగా మార్చేసిందని ఆరోపించారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే తమ ఓటమి ఖాయమని తెలిసే వైసిపి ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతోందని తెలిపారు.

అధికార దుర్వినియోగాన్ని అరికట్టాలని, సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని తాము మంగళవారమూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసినట్లు అజశర్మ వెల్లడించారు. విజ్ఞులైన ఉత్తరాంధ్ర పట్టభద్రులు అధికార పార్టీ ఉల్లంఘనలు, అడ్డదారులు, అక్రమాలను గుర్తెరిగి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, నిజాయతీగా, నిబద్ధతగా, నిస్వార్థంగా పని చేస్తున్న 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రయివేటు విద్యాసంస్థల్లో

'విద్యాహక్కు' ప్రవేశాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యా హక్కు చట్టం కింద 25 శాతం ప్రవేశాలకు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 2023-24 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రయివేటు పాఠశాలల్లో ప్రవేశాలు అమలు చేయాలని వెల్లడించింది. ఇందులో భాగంగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వారి కోసం (అనాథ పిల్లలు, హెచ్ఐవి బాధితుల పిల్లలు, వికలాంగులు) 5 శాతం, ఎస్‌సిలకు 10 శాతం, ఎస్‌టిలకు 4 శాతం, బలహీన వర్గాలకు (బిసి, మైనార్టీ, ఒసి) చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించింది. ప్రయివేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అర్హత కలిగిన పిల్లలకు ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పద్ధతిన 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశం కల్పించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో నివశించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు గాను, పట్టణ ప్రాంతంలో నివసించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షికాదాయం రూ.1.44 లక్షలు గాను ప్రాతిపదికగా తీసుకొంటున్నట్లు చెప్పారు. http://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచినట్లు తెలిపారు. అర్హులైన వారంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులకు ప్రవేశాలకు షెడ్యూల్

1. ఆన్‌లైన్ పోర్టల్‌లో అన్ని ప్రయివేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలు (IB/ICSE/CBSE/State సిలబస్ అమలు చేస్తున్న) నమోదు తేదీలు మార్చి 6 నుంచి 16వ తేది వరకు.
2. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 18 ఏప్రిల్ 7 వరకు గడువు.
3. విద్యార్థుల ఎంపిక ప్రక్రియ ఏప్రిల్ 9 నుంచి 12వ తేది వరకు.
4. మొదటి ఎంపిక జాబితా విడుదల ఏప్రిల్ 13.
5. మొదటి జాబితాలో ఎంపికైన విద్యార్థుల ప్రవేశాలు నిర్ధారించు తేదీలు ఏప్రిల్ 15 నుంచి 21వ తేది వరకు.
6. రెండో విడత ఎంపిక జాబితా విడుదల ఏప్రిల్ 25.
7. రెండో జాబితాలో ఎంపికైన విద్యార్థుల ప్రవేశాలు నిర్ధారించు తేదీలు ఏప్రిల్ 26 నుంచి 30వ తేది వరకు.

12న అండర్- 19 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

విజయనగరం టౌన్ : విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న అండర్ - 19 జిల్లా క్రికెట్ జట్టు (బాలురు) ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరంలోని సర్ విజ్జి స్టేడియంలో ఉదయం ఏడు గంటలకు ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2004 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలని, ఆటగాళ్లు వైట్ డ్రెస్, సొంత క్రికెట్ కిట్‌తో హాజరు కావాలని సూచించారు. విజయనగరం జిల్లాలో జన్మించిన జనన ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జెరాక్సులతో రావాలని తెలిపారు.

నినదించిన మహిళా లోకం

మార్మోగిన సమైక్యతా రాగం

50 వేల మందితో మానవహారం ● ర్యాలీగా సాగి గౌరవ వందనం స్వీకరించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయనగరంలో 50 వేల మందితో నిర్వహించిన మానవహారం సమైక్య స్ఫూర్తిని చాటి చెప్పింది. సాంఘిక దురాచారాలను రూపుమాపుదాం.. రేపటి తరాన్ని కాపాడుదాం.., బాల్య వివాహాలు వద్దు.. బంగారు భవిష్యత్తే ముద్దు.., బాలికా రక్షణే.. భారత రక్షణ.. అనే పలు రకాల నినాదాలతో నగరమంతా మారుమోగింది. వివిధ పాఠశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు, సమాఖ్య సంఘాల సభ్యులు, సచివాలయాల మహిళా ఉద్యోగులు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు నగరమంతా మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఎస్‌పి దీపికా పాటిల్ ఓపెన్ టాప్ వాహనంపై ర్యాలీగా సాగి గౌరవ వందనం స్వీకరించారు. వారితోపాటు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ భాగస్వామ్యమయ్యారు.

కలెక్టరేట్ సమీపంలోని పూలే కూడలి నుంచి ఎస్‌పి కార్యాలయం, ఆర్ అండ్ బి జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్సు, బాలాజీ జంక్షన్, ధర్మపురి జంక్షన్, పోర్ట్ స్కూల్ జంక్షన్, దాసన్నపేట రైతుబజారు, అయ్య కోనేరు, కోట జంక్షన్, సింహాచలం మేడ మీదుగా ఆనంద గజపతి ఆడిటోరియం వరకు మానవహారం చేపట్టారు. దిశ పోలీసు సిబ్బంది, డిఆర్‌డిఎ, ఐసిడిఎస్, మెప్మా, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, అధికారులు, విద్యార్థులు, మహిళా సమాఖ్య సభ్యులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. అనంతరం ఆడిటోరియం ప్రాంగణంలో తెలుగుతల్లి విగ్రహానికి కలెక్టర్, ఎస్‌పి, జెసి తదితరులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మీడియాతో కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ 50 వేల మందితో 10 కిలోమీటర్ల మేర సాగిన మానవహారం.. ఐక్యతకు నిదర్శనమని ఉద్ఘాటించారు. ర్యాలీ సాఫీగా సాగేందుకు పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.





మానవహారంగా నిలబడిన విద్యార్థినులు, ఉద్యోగులు, మహిళా సమాఖ్య సభ్యులు

సమాజ నిర్మాణంలో మహిళలే కీలకం

సమాజ నిర్మాణంలో మహిళలే కీలకమని కలెక్టర్ సూర్యకుమారి పేర్కొన్నారు. ఆనందగజపతి ఆడిటోరియంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాలికను చదివిద్దాం, బాలికను రక్షిద్దాం అనే అంశంపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికీ బహుమతులను అందజేశారు. బాల్య వివాహాలను నిరోధించడంలో కృషి చేసిన వారికి, సఖి సభ్యులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెళ్లితోనే జీవితాలు బాగుపడతాయనే ఆలోచన మారాలని, అనుకోని పరిస్థితులు ఎదురైతే నిలదొక్కుకుని ఉండేందుకు విద్య మాత్రమే ఉపయోగపడుతుందని తల్లిదండ్రులు భావించాలని సూచించారు. జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించడానికే మహిళా దినోత్సవాన్ని అందరి భాగస్వామ్యంతో నిర్వహించినట్లు తెలిపారు. చిన్న పిల్లలను భార్యలుగా మార్చవద్దనే నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఎస్‌పి దీపిక కోరారు. 498ఎ కేసుల్లో 60 శాతం వరకు మహిళలే నేరస్తులుగా ఉంటున్నారని, ఇది తగ్గాలని చెప్పారు. అనంతరం జెసి మయూర్ అశోక్, ప్రముఖ వైద్యులు సమీర్ నందన్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలోని 50 మంది మహిళా పారిశ్రామిక వేత్తల విజయగాథలను ముద్రించిన పుస్తకాలను కలెక్టర్, ఎస్‌పి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ పద్మ లీల పవర్ పాయింట్ ద్వారా సర్వికల్ కేన్సర్ ఎలా వస్తుంది, ఎలా గుర్తించాలి, ఎలా నివారించుకోవాలి అనే అంశాలపై వివరించారు. తాటిపూడి వద్దనున్న సత్య సాయి దివ్యామృతం కేన్సర్ ఆసుపత్రిలో ఉచితంగా కేన్సర్ చికిత్స చేస్తున్నట్లు వైద్యులు మహేష్, సంతోష్ వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, ఐసిడిఎస్, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు శాంత కుమారి, కళ్యాణ చక్రవర్తి, సుధాకరరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.




అభివాదం చేస్తున్న కలెక్టర్, ఎస్‌పి

వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా అవనాపు విక్రమ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా అవనాపు విక్రమ్ నియమితులయ్యారు. దీంతో అవనాపు విక్రమ్‌ను అభిమానులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు అభినందనలతో ముంచెత్తారు. నగరంలోని విక్రమ్ స్వగృహంలో మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విక్రమ్ మాట్లాడుతూ పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మరింత బలోపేతం చేస్తానని తెలిపారు. వైసిపి ఆవిర్భావం తర్వాత ఉత్తరాంధ్రలో పార్టీ జెండా పట్టుకున్న మొదటి వ్యక్తి తన తండ్రి, మున్సిపల్ మాజీ చైర్మన్ అవనాపు సూరిబాబేనని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పార్టీ అధినేత జగన్‌ను సిఎంను చేయడమే లక్ష్యంగా పని చేశామని చెప్పారు. సిఎం జగన్ తమ కుటుంబానికి అండగా నిలిచారని తెలిపారు. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్దార్థ రెడ్డి నాయకత్వంలో ముందుకు వెళ్తామన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన వైసిపి నేతలు వై.వి.సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ సిఎం రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. విక్రమ్‌ను జోనల్ ఇన్‌ఛార్జిగా నియమించడంపై ఆయన సతీమణి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన హర్షం వ్యక్తంచేశారు.



మాట్లాడుతున్న అవనాపు విక్రమ్

మహిళలను గౌరవించాలి

డబ్ల్యుహెచ్‌ఆర్‌సి ఉమెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు చింత శారద



ప్రజాశక్తి-బొబ్బిలి

ఆడపిల్లలు, మహిళలను గౌరవించాలని డబ్ల్యుహెచ్‌ఆర్‌సి ఉమెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, అభ్యుదయ పాఠశాల ప్రిన్సిపల్ చింత శారద కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. సమాజంలో మానవ విలువలు తగ్గిపోవడంతో మహిళలు, చిన్నారులపై రోజురోజుకు దాడులు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మహిళలను ప్రతిఒక్కరూ గౌరవిస్తేనే సమాజంలో వారికి భద్రత ఉంటుందన్నారు. మహిళలపై దాడుల నివారణకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యాసంస్థలలో అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. వేధింపులకు గురైతే వెంటనే పోలీసులు లేదా తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేయాలని బాలికలకు ఆమె సూచించారు. సోషల్ మీడియా ప్రభావంతో మహిళలు, బాలికలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థులు సోషల్ మీడియాకు, స్మార్ట్‌ఫోన్ల వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగం పెరగడంతో మత్తులో ఏంచేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలని కోరారు. ఆడపిల్లలను సోదర భావంతో చూసేలా పిల్లలను పెంచాలని కోరారు. ఏదైనా సమస్యతో మహిళలు, ఆడపిల్లలు తమను సంప్రదిస్తే సంబంధించిన అధికారులు, న్యాయవాదులు, పోలీసు అధికారులతో చర్చించి న్యాయం చేస్తున్నామని వివరించారు.

ఎన్నో సేవలు.. మరెన్నో అవార్డులు

సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న డబ్ల్యుహెచ్‌ఆర్‌సి ఉమెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు శారద.. ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నారు. 2016లో అభిమాని ఫౌండేషన్ సంస్థ సేవాశ్రీ, 2019లో సన్ టివి, వే ఫౌండేషన్ సంస్థ ఇండియన్ ఉమెన్ సమ్మిట్‌లో ఉమెన్ ఎక్స్‌లెన్స్ ఇన్ లీడర్‌షిప్ అవార్డును అందజేశాయి. 2020లో రెడ్‌క్రాస్ సంస్థ గాంధీజీ ప్రతిభా పురస్కారం అందించింది. 2022లో సామాజిక సేవకు గుర్తింపుగా హెచ్‌ఎస్‌సి యూనివర్సిటీ శారదకు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 2023లో వరంగల్‌కు చెందిన కన్నతల్లి ఫౌండేషన్ సంక్రాంతి జాతీయ పురస్కారం, హైదరాబాద్‌కు చెందిన సేవ్ ద చైల్డ్ అండ్ బీ ద ఛేంజ్ ఫౌండేషన్ షీ ఇన్‌స్పైర్ అవార్డు ప్రదానం చేశాయి. అనేక రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో రక్తనిధి నిర్వాహకులు పలు అవార్డులతో శారదను సత్కరించారు. అవార్డులు సమాజం పట్ల బాధ్యతను పెంచుతాయని చింత శారద చెబుతున్నారు. మరిన్ని సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఉద్యోగాల పేరుతో మోసం

నిందితులను కఠినంగా శిక్షించాలి : ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి మోసగించిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్‌రావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.హరీష్ ఒక ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. జిల్లాలో ఇటీవల ప్రభుత్వ ఆస్పత్రుల్లో ల్యాబ్ టెక్నీషియన్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ సంతోష్‌కుమార్, నాగరాజు నుంచి అంబులెన్స్ శివ, అనిల్ కుమార్ రూ.6 లక్షలు వసూలు చేశారని చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇటువంటి ఆర్థిక మోసాలు తరచూ జరుగుతున్నాయని తెలిపారు. అందులోనూ మన జిల్లాలో రోజురోజుకూ మరింత ఎక్కువవు తున్నాయని చెప్పారు. ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను ప్రభుత్వం కల్పించకపోవడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకముందే జిల్లాలోని నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలని కోరారు. మోసానికి పాల్పడిన వారిని తక్షణమే కఠినంగా శిక్షించాలని, బాధితులకు తిరిగి డబ్బులు చెల్లించేలా చూడాలని అధికారులను కోరారు. నిరుద్యోగుల సహాయార్థం 7075712379, 8019273486 నంబర్లను సంప్రదించాలని కోరారు.

14న జనసేన ఆవిర్భావ సభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 14న మచిలీపట్నంలో నిర్వహించే జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు గురాన అయ్యలు కోరారు. జనసేన ఆవిర్భావ సభ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి మంగళవారం స్థానిక జిఎస్ఆర్ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ ఆవిర్భా సభ వేదిక నుంచే భవిష్యత్తు రాష్ట్ర రాజకీయాలకు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేస్తారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడమే జనసేన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆదాడ మోహన్ రావు, ఎల్.రవితేజ, రాజేష్, ఎం.పవన్ కుమార్, పిడుగు వెంకట్రావు, వై.సురేష్, సాయి, కె.సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

కొత్తవలస : మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. వీరభద్రపురం ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.భీమ శంకరరావు అధ్యక్షతన, ఎన్ఎస్ఎస్ పిఒ జి. శ్రీరాములు ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా రక్షణ, మహిళా సాధికారిత, సమానత్వం కోసం ప్రతి ఒక్కరు వాటి గురించి చర్చించుకోవాలని ప్రిన్సిపాల్ వివరించారు. బెస్ట్ ఉమెన్ టైటిల్‌తో మహిళా అధ్యాపకులైన విజయ, జ్యోతి రాణి, నీల ప్రశాంతి, రామలక్ష్మి, మాధవి లత, అనుపమ, సిబ్బంది రజని, కనక మహాలక్ష్మి ప్రకాశమ్మ, రమణమ్మలను జ్ఞాపికలు, సాలువాలతో ఘనంగా సత్కరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలు -స్వీయ రక్షణ అనే అంశం మీద విద్యార్థినిలకు వ్యాస రచన పోటీలు, మహిళలు సాధికారిత అనే అంశం మీద వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులతో పాటు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. స్వయ్ మార్షల్ ఆర్ట్స్ స్టేట్ వైస్ చైర్మన్ త్రినాథ రావు, విద్యార్థినిలకు స్వీయ రక్షణ అనే అంశం మీద ట్రైనింగ్, తల్లి, బిడ్డ, మహిళల ఆరోగ్యం పట్ల తగు సూచనలు



అధ్యాపకురాలని సత్కరిస్తున్న తోటి అధ్యాపకులు

అనే అంశం పైన హెల్త్ అసిస్టెంట్ శేషుబాబు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయనగరం: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఆ కళాశాలతోపాటు సత్య డిగ్రీ, పిజి కళాశాలలు సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాయి. ముఖ్యఅతిథిగా సత్య విద్యాసంస్థల సెక్రటరీ, కరెస్పాండెంట్ బొత్స ఝన్సీలక్ష్మి, ప్రత్యేక ఆహ్వానితులుగా ఎంఆర్ సంగీత కళాశాల అధ్యాపకులు హిమబిందు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ బి.విజయలక్ష్మి, సబల ఎన్‌జిఒ వ్యవస్థాపకులు కె.సరస్వతి హాజరయ్యారు. కళాశాల సెక్రటరీ బొత్స ఝన్సీలక్ష్మి మాట్లాడుతూ రాజకీయ రంగంలో తన అనుభవాలను పంచుకుంటూ పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. అనంతరం అతిథులను సత్కరించారు. మహిళా అధ్యాపకులకు వివిధ ఆటల పోటీలు, విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు, బృందచర్చల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సత్య విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, సత్య డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వి.సాయి దేవమణి, మజ్జి అనురాధ, బొత్స పూజిత, సీతం వైస్ ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్‌లో: గ్రామీణ నీటి సరఫరా శాఖలో మహిళా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఎస్ఇ బి.ఉమాశంకర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ముందుకు సాగినప్పుడే సమాజం మరింత ప్రగతి పథంలో కొనసాగుతుందన్నారు.

వైసిపి ఎస్‌టి సెల్ జోనల్ ఇన్‌ఛార్జిగా శంకరరావు

నెల్లిమర్ల : వైసిపి ఎస్‌టి సెల్ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల జోనల్ ఇంఛార్జిగా డాక్టర్ డివిజి శంకరావును నియమించారు. ఈ మేరకు తనను నియామకం చేసినందుకు పార్టీ పెద్దలకు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం షెడ్యూల్ తెగల సంక్షేమం, అభివృద్ధి, సాధికారికత దిశగా తీసుకుంటున్న చర్యలపై మరింత విస్తృతంగా ప్రచారం చేసేలా తన వంతు కృషి చేస్తానన్నారు.

చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి


తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

వేపాడ : మండలంలోని బొద్దాంలో సచివాలయ సిబ్బంది చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గ్రామంలో ఇళ్లల్లో లభ్యమైన పొడి చెత్త, తడి చెత్తలను వేరు వేరుగా రిక్షాలో వేసేలా అవగాహన కల్పించారు. దీంతో ప్రతి రోజు రిక్షాలో చెత్తను వేరు వేరుగా వేస్తున్నారు. ఇదే విధంగా పలు గ్రామాల్లో పారిశుధ్యంపై సిబ్బంది దృష్టి పెట్టి పనులు చేస్తున్నారు. దీనికి ప్రతి రోజూ ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ గ్రామాల్లో పరిశీలన చేయడమే కారణంగా చెబుతున్నారు.

ఎస్‌డబ్ల్యుపి షెడ్ల ఉపయోగంపై సదస్సు

వేపాడ : మండలంలోని గుడివాడ గ్రామంలో పంచాయతీ కార్యాలయ సిబ్బందికి మంగళవారం ఎస్‌డబ్ల్యుపి షెడ్ల ఉపయోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యుపి షెడ్ల ద్వారా ఎరువులు తయారు చేయవచ్చునన్నారు. చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలు వల్ల కలిగే ప్రయోజనాల గూర్చి వివరించారు. ఈ సదస్సులో సర్పంచ్ గోపి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

వేపాడ : మండలంలోని బొద్దాం ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ జి. శ్రీదేవి మంగళవారం పరిశీలించారు. ట్రాల్ గ్రేడింగ్ రిజిస్టర్, విద్యార్థులు స్టాండర్డ్ పైన పరిశీలన చేశారు. నూతన విద్యా విధానంలో బోధనలు ఉండాలని సూచించారు. ఈ పరిశీలనలో ఆమె వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఇఒ

పెట్టుబడులు ఉపసంహరణ అన్యాయం

బొబ్బిలి : ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎల్ఐసి నుంచి కేంద్ర ప్రభుత్వం పెట్టుబడులను ఉపసంహరణ చేసుకోవడం అన్యాయమని పిసిసి సభ్యులు ముచ్వల శ్రీనివాసరావు అన్నారు. పెట్టుబడులు ఉపసంహరణకు వ్యతిరేకంగా స్టేట్ బ్యాంకు వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పెట్టుబడులను ఉపసంహరణ చేస్తుందన్నారు. పెట్టుబడులను ఉపసంహరణను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, కాంగ్రెస్ నాయకులు సూరిబాబు, శంకరరావు, ప్రసాద్, కూర్మరావు తదితరులు పాల్గొన్నారు.

బూరాడ జంక్షన్‌లో చెక్‌పోస్ట్ ఏర్పాటు


కారును తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని బూరాడ జంక్షన్ వద్ద ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా మంగళవారం ఎస్ఐ ఈ. శ్రీనివాసరావు వాహన తనిఖీల చేసి చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఎస్‌పి ఆదేశాల మేరకు చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీలకు చెందిన వారు ఓటర్లకు మభ్య పెట్టేందుకు నగదు పంపిణీ చేస్తారని ఉద్దేశంతో చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. వాహన తనిఖీ చేసినప్పుడు వాహన యజమానులు, వాహనదారులు తీసుకువెళ్లిన నగదుకు తప్పనిసరిగా రసీదులు ఉండాలన్నారు. లేకుంటే సీజ్ చేస్తామన్నారు. ఈ చెక్ పోస్టు వద్ద 24 గంటలూ షిఫ్ట్ వారీగా పోలీస్ సిబ్బంది ఉంటారన్నారు.

పోలిపల్లి గ్రామదేవతను దర్శించుకున్న ఎమ్మెల్యే

భోగాపురం : భోగాపురం, పోలిపల్లి గ్రామ దేవతలైన శ్రీ కనకదుర్గమ్మ, పోలిపల్లి పైడితల్లి అమ్మవార్లను నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చర్యలు తీసుకోవాలని ఉత్సవ కమిటీకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ, పోలిపల్లి సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, భోగాపురం వైసిపి నాయకులు పడాల శ్రీనివాసరావు, భాను ప్రకాష్, సుందర హరీష్, మాధవరావు, పోతిరెడ్డి గోపి, ప్రసాద్, పోలిపల్లి నాయకులు పిన్నింటి చిన్న, బంగార్రాజు, అప్పలనాయుడు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

ఘనంగా ప్రారంభమైన ముత్యాలమ్మ జాతర

వేపాడ : మండలంలోని సోంపురం ముత్యాలమ్మ జాతర మంగళవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపిపి డి. సత్యవంతుడు, వైస్ ఎంపిపిలు ఈశ్వరరావు, రమణ, గ్రామ పెద్ద జాగరపు పెద్ద రామునాయుడు, సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపిటిసి ఆకుల సత్యనారాయణ, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల బండ్ల పరుగు పందేలు, తీన్మార్ మహిళ నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మాజీ ఎంపిటిసి మృతికి ఎమ్మెల్యే సంతాపం

తెర్లాం : మండలంలోని బూరిపేట గ్రామ మాజీ ఎంపిటిసి బూరి అప్పలస్వామి నాయుడు మరణించడంతో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు మంగళవారం ఆ గ్రామం వెళ్లి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అప్పలస్వామి నాయుడు 25 ఏళ్లు ఏకగ్రీవంగా సర్పంచ్‌గా పనిచేశారని గుర్తు చేశారు. మృతుని కుమారుడు, ప్రస్తుత సర్పంచ్ బూరి మధుసూదనరావును మండల నాయకులు, గ్రామ సర్పంచ్ లు పరామర్శించి సంతాపం తెలిపారు.

గిరిజన గ్రామాల్లో డిఐఒ పర్యటన

గుమ్మలక్ష్మీపురం : మండలంలో దుడ్డుఖల్లు, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న మారుమూల గిరిజన గ్రామాలు కుస, దేరువాడ, కొత్తవలస, లోవలక్ష్మీపురం, గొరడ, రేగిడి, దుడ్డుఖల్లు గ్రామాలను మంగళవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు, హై రిస్క్ గర్భిణులు, బాలింతలు, శిశువుల గృహ సందర్శనలు చేసి అందుతున్న వైద్య సేవలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. మాతా శిశు సంరక్షణ కార్డులను నమోదు వివరాలను పరిశీలించి గర్భిణుల, శిశువుల ఆరోగ్య పర్యవేక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు చేసి అవగాహన కల్పించారు. ప్రసవ తేదీకి ముందుగానే నిర్దేశించిన ఆసుపత్రిలో చేర్చాలని వైద్య సిబ్బంది సూచించారు. అనారోగ్య లక్షణాలతో ఉన్న వారి గృహ సందర్శనలు చేసి మందులు అందజేశారు. అత్యవసర మందుల గ్రామాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. తదుపరి అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించి శిశువుల ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. చిన్నారుల బరువులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం దుడ్డుఖల్లులో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను, రేగిడిలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. రక్తహీనత, సీజనల్ వ్యాధులు, ఇమ్యూనిటీ, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు బి. స్వాతి, ఎమ్. శంకర్, హాస్టల్ ప్రిన్సిపాల్స్ సుగుణ, సుబ్బారావు, సూపర్ వైజర్స్ రమణ, రాజేశ్వరి, శ్రీను, నిర్మల, జయ గౌడ్, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

ఆడ దూడలు ఉత్పత్తికి ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆడ దూడల ఉత్పత్తికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పశుగణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్. దామోదరరావు అన్నారు. పశువైద్యశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాల ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వం లింగ నిర్ధారత వీర్యనాళికల ఇంజెక్షన్లను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ముర్రా, జెర్సీ, హెచ్ఎఫ్, జెర్సీ క్రాస్, హెచ్ఎఫ్ క్రాస్, గిర్, సాహివాల్ జాతుల లింగ నిర్ధారత వీర్య నాళికలను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. రెండు ఇంజెక్షన్ల ధర రూ.1350 అయితే రైతులకు రూ.500కే అందిస్తున్నట్లు చెప్పారు. చూడు నిలబడకపోతే రైతులకు డబ్బులు వాపసు చేయబడతాయన్నారు. మగ దూడ పుడితే రూ.250 రైతుకు తిరిగి ఇచ్చి వేస్తామన్నారు. జిల్లాలో 2,740 ఇంజెక్షన్లు అందుబాటులో


లేగ దూడలను పరిశీలిస్తున్న వైద్యులు

ఉన్నాయని, ఇప్పటి వరకు 555 పశువులకు ఇంజెక్షన్లు చేసినట్లు చెప్పారు. పాడిరైతులకు ఎంతోమేలు చేస్తుందన్నారు.

లేగదూడల ప్రదర్శనకు విశేష స్పందన

ప్రభుత్వ పశు వైద్యశాలలో మంగళవారం నిర్వహించిన లేగ దూడల ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. ప్రదర్శనలో బొబ్బిలి, మల్లమ్మపేట, గున్నతోట వలస, గొల్లపల్లి నుంచి 27 ఆడ గేదె దూడలు పాల్గొన్నాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో రెండు నెలల లోపు దూడల విభాగంలో వినోద్, నాగరాజు, రంగనాధంకు చెందిన దూడలు, మూడు నుంచి ఆరు నెలలు బి.సింహచలం, ఎ.పాపరాయ, పి.జయంత్, ఆరు నుంచి 12 నెలలు లోపు ఎ.రంగనాథం, కె. శ్రీనివాసరావు, ఎం.సత్యం యొక్క దూడలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డిడి రెడ్డి నీలయ్య, ఎడి ఎల్.విష్ణు, శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

పోలింగ్ కేంద్రం పరిశీలన

బాడంగి : ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఆర్‌డిఒ శేష శైలజ పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని తహశీల్దార్ బాలమురళీకృష్ణకు సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటలను రుచి చూసి మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

ఎప్పుడు కూలిపోతుందో..?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నీలకంఠ రాజపుర అగ్రహారం గ్రామంలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్దంగా ఉంది. ఈ పథకానికి గల నాలుగు స్తంబాలు పెచ్చులూడిపోయి ఉండటం వల్ల ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. మెట్లు, ట్యాంకు కూడా శిథిలమై పోవడంతో కూలిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శితో పాటు పలువురు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరిన రక్షిత పథకం

శిథిల గదిలోనే విధులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని నల్లబెల్లి గ్రామంలో సచివాలయ సిబ్బంది శిథిల ఇరుకు గదిలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. సచివాలయ సిబ్బంది విధులు నిర్వహించడానికి వీలుగా లేకపోయినప్పటికీ తప్పని స్థితిలో కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలు ఇరుకు గదిలోనే సేవలు అందించవలసి వస్తుంది. గ్రామ సచివాలయ భవనం నిర్మించినప్పటికీ బిల్లులు పూర్తిగా చెల్లించకపోవడంతో భవనం ప్రారంభించలేదు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి నూతన భవనాన్ని ప్రారంభించి సచివాలయం సిబ్బంది పడుతున్న ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.



శిథిలావస్థలో పంచాయతీ కార్యాలయం

చలివేంద్రం ఏర్పాటు

నెల్లిమర్ల : స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ బాలాజీ ప్రసాద్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలం దృష్ట్యా కార్యాలయానికి వచ్చే ప్రజలు, ఉద్యోగులు, అధికారుల సౌకర్యార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

కుక్కలకు వ్యాక్సిన్ విషయంలో సహకారం అవసరం

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో కుక్కలకు వ్యాక్సిన్ వేసే విషయంలో నగర పంచాయతీ సిబ్బంది సహకారం కావాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి. చక్రవర్తి కోరారు. మంగళవారం ఆయన నగర పంచాయతీ కమిషనర్ బాలాజీ ప్రసాద్‌ను కలిసి తమకు సహకరించాలని కోరారు. కుక్కలకు యాంటి బ్రీత్ కంట్రోల్ చేసి వ్యాక్సినేషన్ చేస్తామని చెప్పారు.

కుక్కలను నివారించాలని రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వల్లంపూడి గ్రామంలో గత మూడు రోజులుగా సేనాపతి వారి కల్లాలలో కుక్కలు బారిన పడి 8 ఆవు దూడలు మృతి చెందాయని కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని రైతులు ఇఒపిఆర్‌డి సూర్యనారాయణకు మంగళవారం వినతి పత్రం అందించారు. అలాగే పశువులకు నీరు లేక ఇబ్బంది పడుతున్నామని కల్లాల వద్ద కులాయి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి, ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్, రైతులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వల్లే..

మండల కేంద్రంలోని వల్లంపూడి గ్రామంలో సేనాపతి వారి కల్లాలలో మంగళవారం కుక్కలు దాడిలో ఆవు దూడ మృతి చెందింది. గత మూడు రోజుల వ్యవధిలో సుమారు 8 ఆవు దూడలను కుక్కలు చంపేసినట్లు గ్రామస్తుల చెబుతున్నారు. కోళ్ల ఫారాలు నుండి వచ్చిన వ్యర్థాలు, చనిపోయిన కోళ్ల మాంసానికి అలవాటు పడిన కుక్కలు పశువుల శాలల్లో ఉన్న దూడలోపై దాడి చేసి చంపేస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కుక్కుల బెడద నుంచి తమను రక్షించాలని కోరుతున్నారు.

ఇఒపిఆర్‌డికి వినతినిస్తున్న రైతులు



అవార్డు అందుకుంటున్న ఎపిఎం విజయలక్ష్మి

ఉత్తమ ఎపిఎంగా విజయలక్ష్మి

డెంకాడ : ఉత్తమ ఎపిఎంగా పి.విజయలక్ష్మి ఎంపికయ్యారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు సెర్ప్ సిఇఒ, పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ రాజశేఖర్ చేతులు మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ మేరకు ఆమెను పలువురు ఉద్యోగులు, తోటి సిబ్బంది అభినందించారు

క్రమ శిక్షణతో ఉన్నత విద్య

వంగర: విద్యార్థులు క్రమ శిక్షణతో చదివి ఉన్నత విద్యను అభ్యసించాలని ఎంపిపి యు.సురేష్ ముఖర్జీ, తహశీల్దార్ డి.ఐజాక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వివేక్ మాస్టర్ మైండ్స్ స్కూల్ పదవ తరగతి విద్యార్థుల వీడ్కోల సభలో వారు పాల్గొని మాట్లాడారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించి ఉత్తమ పౌరులుగా మంచి ఉద్యోగంలో స్థిరపడాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ వంగర బ్రాంచి మేనేజర్ శేఖర్, ఎస్ఐ లోకేశ్వరరావు, ఎంఇఒ వై. దుర్గారావు, డిటి సుందరరావు, ఆర్ఐ మురళి, పాఠశాల ప్రదానోపాధ్యాయులు ఈశ్వరరావు, ఎలక్ట్రికల్ ఎఇ వినయ్ కుమార్, పారినాయుడు, లక్షున్నా యుడు, చక్రపాణి, విశాలాక్షి, నేతాజి తదితరులు పాల్గొన్నారు.

కషాయ ద్రావణాలతో మేలు

రేగిడి: పంటలలో పురుగుల తెగుళ్ల నివారణకు కాషాయ ద్రావణాలు ఎంతో మేలు చేకూరుతాయని మాస్టర్ ట్రైనర్ సిహెచ్ శారద అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని సోమరాజుపేట గ్రామంలో కె.నారాయణరావు రైతు పొలంలో నువ్వుల పంటలలో పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలలో పురుగులు తెగుళ్ల వాటి నివారణకు అవసరమయ్యే కషాయాలు ద్రావణాలు తయారు చేసి, పిచికారి చేయాలన్నారు. పంటలో ఏ విధంగా మార్పులు వస్తున్నాయో, కొమ్మలు, వేర్లు వృద్ధి చెందుతాయో గమనించాలన్నారు. రైతులు భాగస్వామ్యంతోనే పొలంబడి విజయవంతం అవుతుందని అన్నారు. పంటలలో పూర్తిస్థాయిలో శస్యరక్షణ చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో విఎఎ అసిరినాయుడు, రైతులు పాల్గొన్నారు.

అపారిశుధ్యంపై ఆగ్రహం

ప్రజాశక్తి- బొబ్బిలి

పాత బొబ్బిలిలో అపారిశుధ్యంపై మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత బొబ్బిలిలో మంగళవారం పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. రోడ్లు, కాలువలలో చెత్త ఉండడంతో సచివాలయ శానిటేషన్ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్లు, కాలువలలో చెత్త వేయకుండా చూడాలన్నారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుధ్య కార్మికుల పని తీరు, వీధి దీపాలు నిర్వహణపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.


సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- మెంటాడ

అనిల్ నిరుకొండ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం మెంటాడ గద్దెం చెట్టు వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 310 మందికి తనిఖీలు నిర్వహించి 60 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈ శిబిరంలో చిన్నపిల్లల, దంత, గుండె, కంటి, ఎముకలు, స్త్రీల సంబంధిత వైద్య సేవలు అందించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సుమంత్, డాక్టర్ జితేంద్ర, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ హర్షిణి, డాక్టర్ రేణుకా, డాక్టర్ ఫర్హాన్ భావన, పిఆర్ఒ త్రినాథ్‌తోపాటు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

ఇఎస్ఐపై అవగాహన

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి వద్దగల శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ ఇండస్ట్రీలో పనిచేస్తున్న కార్మికులకు ఇఎస్ఐపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 71వ ఇఎస్ఐ డే సందర్భంగా జరిగిన సదస్సులో ఇఎస్ఐ బ్రాంచ్ మేనేజర్ పెద్దింటి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులందరూ ఇఎస్ఐపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇఎస్ఐ ద్వారా లభించే వసతులు గూర్చి వివరించారు. కర్మాగారంలో చేరిన నాటి నుంచి ఎంప్లాయ్‌కి ఉండవలసిన బెనిఫిట్స్ గురించి వివరించారు. కంపెనీలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి ఇఎస్ఐ కార్డ్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శారద కంపెనీ యాజమాన్యం, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

బొబ్బిలి : వేసవిలో తాగు నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఇ కె రాజారావు కోరారు. భోజరాజపురం వద్ద ఉన్న మున్సిపల్ ప్రధాన తాగునీటి సరఫరా కేంద్రాన్ని ఆయన మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగావతి నదిలో నీటి ప్రవాహం తగ్గడంతో తాగునీటి సమస్య తలెత్తకుండా నదిలో ఇసుక బస్తాలతో గట్టు వేయాలన్నారు. ఇంఫిల్టర్ బావులు వద్ద నీరు నిల్వ ఉండేలా చూడాలని కోరారు. పట్టణ ప్రజలకు తాగునీరు అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మోటర్లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించారు. ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు సరఫరా చేయాలన్నారు. పబ్లిక్ హెల్త్ ఇఇ దక్షిణామూర్తి, డిఇ రవికుమార్, ఎఇ సురేష్ ఉన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఇ రాజారావు

రమాప్రభను గెలిపించండి

పూసపాటిరేగ : పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు రవికుమార్, ఎం.సౌమ్య కోరారు. మంగళవారం మండలంలో పలు ప్రాంతాల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగానికి రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం, దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీవ్రమైన అన్యాయం చేస్తున్నాయన్నారు. నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చి విద్యార్థులను బడి బయటకు పంపించే విధంగా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని విమర్శించారు. విద్యారంగ సమస్యలపై, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న 250 సంఘాలకు పైగా బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఓటర్లు తమ మొదటి ప్రాధాన్యత ఓటు ప్రజల కోసం కష్టపడుతున్న శ్రమిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణికంఠ, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రామభద్రపురం: మండలంలోని ఆరికతోటలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని యుటిఎఫ్, ప్రజాశక్తి సిబ్బంది మంగళశారం ప్రచారం చేశారు.


నేరాలు ఘోరాలు

చెరువులో పడి మహిళ మృతి

బొబ్బిలి: మండలంలోని గొర్లె సీతారాంపురం సమీపంలో అప్పయ్య చెరువులో పడి బాడంగి మండలం పెద్దపల్లి గ్రామానికి చెందిన రేగులవలస సుబ్బలక్ష్మి మరణించింది. చెరువులో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు, పోలీసు సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలుకు 50ఏళ్లు వయస్సు ఉండవచ్చునని అంచనా వేశారు. ఈమె గత కొంత కాలంగా భర్తతో విడిపోయి బొబ్బిలిలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తతమవుతున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాడంగిలో వరి కుప్పలు దగ్ధం

బాడంగి: బాడంగి గ్రామంలో మంగళవారం రాత్రి వరి గడ్డి, ధాన్యం పంట దగ్ధమైన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మరడాన చంద్రు నాయడు తన అన్నదమ్ములతో కలిసి 5ఎకరాల్లో వరి పండించాడు. కోత కోసి ఊరు పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో కుప్పలుగా నిల్వ ఉంచారు. ఈ పంటకు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. గ్రామస్థులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేసి విఫలమయ్యారు. పంట పూర్తిగా కాలిపోయిందని, ప్రభుత్వ సాయం అందించాలని బాధిత రైతులు కోరారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదు.


కాలి బూడిదవుతున్న వరి కుప్పలు